సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా టీడీపీ నుంచి భారీగా వస్తున్నారు. -8లో



భార్యపై హత్యాయత్నం

పూటుగా మద్యం తాగిన భర్త కట్టుకున్న భార్యపై దాడి చేసి, మద్యం బాటిల్ పగలగొట్టి గొంతు కోసిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.230
రెండోరకం	రూ.80	రూ.158



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 190 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	342	409
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 282.780 కిలోలు

పెల్లుబికిన ఆగ్రహం

- సీఎం వైఎస్ జగన్‌పై దాడిని ఖండించిన నేతలు
- కొవ్వొత్తుల ర్యాలీలు.. నల్లబ్యాడ్జీలతో ప్రదర్శనలు



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న సతీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



వల్లూరులో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ



రైల్వేకోడూరులో నల్లబ్యాడ్జీలతో ప్రభుత్వవిప్ కొరముట్ల నిరసన

సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడి ఘటనపై జనాగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆ పార్టీ నేతలు, పలువురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు.. ప్రజాస్వామ్య వాదులు ఈ ఘటనను ఖండించారు. ఆదివారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పలుచోట్ల నిరసనలు తెలిపారు. కడప, బద్వేలు, వేంపల్లెలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. రైల్వేకోడూరు, పెద్దతిప్పసముద్రంలో వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులు, అభిమానులు నిరసనలు చేపట్టారు. ఇది ప్రతిపక్ష కుట్రేనని..దీనిపై పక్కాగా విచారణ చేసి దోషులను శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



పెద్దతిప్పసముద్రంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

ఇది పిరికిపంద చర్య



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో రాయితో దాడిచేయడం పిరికిపంద చర్య. దాడి చేసిన వారు ఎంతటివారైనా వెంటనే చర్యలు తీసుకోవాలి. సీఎం బస్సుయాత్రకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక, దమ్ము, ధైర్యంలేక ప్రతిపక్షాలు ఇలాంటి రాళ్లదాడి చేసి దొంగదెబ్బతీయాలనుకోవడం చేతకానితనానికి నిదర్శనం.రాజకీయ లబ్ధికోసం ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడడం మంచిది కాదు.

– వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎంపీ, కడప

ఇది ప్రతిపక్షాల కుట్రే



విజయవాడలో శనివారం రాత్రి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో కొట్టి గాయపరచిన సంఘటన అత్యంత హేయం. దాడి వెనుక ప్రతిపక్షాల కుట్ర దాగి ఉంది. దాడులతో రాజకీయాలు చేయాలనుకోవడం సరికాదు. ప్రజలు ఓటుతో చంద్రబాబుకు బుద్ధి చెపుతారు. దాడి వెనుక ఉన్న వారిని, దాడి చేయించిన వారిని త్వరగా గుర్తించి సరైన గుణపాఠం చెప్పాలి. ఎన్నికల కమిషన్ ముఖ్యమంత్రికి గట్టి భద్రత కల్పించాలి.

–డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

ఆదరణ చూసి ఓర్వలేకనే..



ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు, ఆయన మిత్రపక్షాలు కుట్రపన్ని దాడి చేయించారు.చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు నిర్వహించే సభల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారానే దాడి జరిగింది. పోలీసులు పూర్తిస్థాయిలో విచారించి దుండగులను కఠినంగా శిక్షించాలి.

–డాక్టర్ సుధ, ఎమ్మెల్యే బద్వేలు

ఓటమి భయంతోనే దాడులు



టీడీపీ వారు జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే దాడులకు పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడటం హేయం. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని భగవంతుడిని కోరుకుంటున్నానని తెలిపారు.

– ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ఇలాంటి దాడులు బాధాకరం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబు టీడీపీ కార్యకర్తలతో సీఎం వైఎస్ జగన్‌పై రాయితో దాడి చేయించారు. అధికారం కోసం దాడులు చేయించడం బాధాకరం. ఎవరూ ఇలాంటి రాజకీయాలు చేయకూడదు. ప్రజలు చూస్తూ ఊరుకోరు. ప్రజా క్షేత్రంలో ఓటు రూపంలో చంద్రబాబుకు ప్రతి ఒక్కరూ తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైంది.

– ఆర్ రమేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ప్రజాదరణ చూసి ఓర్వలేకనే దాడి



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం రోడ్‌షోలకు వస్తున్న అసాధారణ స్పందన చూసి, ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు, ఆయన పార్టీ కార్యకర్తలకు కడుపు రగిలిపోయి దాడికి పాల్పడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై రాళ్లదాడి దారుణమని, ఇది పిరికిపందల చర్య.ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, కుయుక్తులు పన్నినా, ప్రజాక్షేత్రంలో వైఎస్సార్ సీపీ ఘనవిజయం సాధించడం, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం.

–నిసార్‌అహ్మద్, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

న్యూస్‌రీల్

నేడు పీవో, ఏపీవోలకు శిక్షణ

రాజంపేట: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా స్థానిక ప్రభుత్వడిగ్రీ కళాశాలలో సోమవారం, మంగళవారంలలో పీవో, ఏపీవోలకు శిక్షణాతరగతులు నిర్వహించనున్నారు. ఈమేరకు సబ్ కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గంలో పోలింగ్‌బూత్‌ల నిర్వహణ విషయంలో పీవో,పీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్వో టీ.మోహనరావు నేతృత్వంలో శిక్షణా తరగతులు జరుగనున్నాయి.

లోకాయుక్తకు ఘనంగా వీడ్కోలు

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పీ.లక్ష్మణరెడ్డి వేసవి విడిది కోసం ఆయనకు ఇష్టమైన ప్రాంతం మండలంలోని టి.సదుం పంచాయతి చెన్నరాయునిపల్లికి 10 రోజుల క్రితం విచ్చేశారు. పలు జిల్లాలు, మండలాల నుంచి పలువురు సమస్యలను అర్జీల రూపంలో లోకాయుక్తకు అందజేశారు. స్పందించిన ఆయన పలు అర్జీలకు సంభంధించి సత్వరం పరిష్కారం అయ్యేలా ఆయా శాఖల అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. పట్టెంవాండ్లపల్లి పంచాయతిలోని 1 సర్వే నంబర్‌లో తాము కొనుగోలు చేసి సాగు చేస్తున్న భూములకు వన్‌బీ, అడంగల్ రాలేదని ఐదుగురు రైతులు అర్జీలివ్వగా రికార్డులు సమగ్రంగా ఉండి న్యాయబద్దంగా ఉంటే పరిష్కారం అయ్యేలా చూస్తానని లోకాయుక్తా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం లోకాయుక్తకు డీఎస్పీ కోలార్ కృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డితో పాటు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన పోలీస్ ఎస్కార్ట్‌తో రోడ్డు మార్గంలో కర్నాటక రాష్ట్రం బాగేపల్లి మీదుగా కర్నూలుకు వెళ్లారు.

అగ్నిప్రమాదాల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలి

రాయచోటి టౌన్: అగ్నిప్రమాదాలను నుంచి మనల్ని మనం కాపాడుకోవాలని అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త వహించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషేక్ కిశోర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం రాయచోటిలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను తెలిపే పోస్టర్లను విడుదల చేశారు. అలాగే ఏడాది కాలంలో అగ్నిప్రమాదాల్లో మృతిచెందిన అగ్నిమాపక సిబ్బంది అమరవీరుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడం కూడా చట్టపరమైన చర్యలన్నారు. అడవులను కాపాడే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, జిల్లా అగ్నిమాపక అధికారి (డీఈఆర్అండ్ ఎఫ్‌వో) అనిల్‌కుమార్, ఆర్‌డీవో రంగాస్వామి, రాయచోటి అగ్నిమాకప అధికారి ఎం. వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప జయనగర్‌కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ బాలబాలికల జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సహదేవరెడ్డి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19 నుంచి 22 వరకు నూజివీడులో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. 2006 జనవరి 1వ తర్వాత పుట్టిన క్రీడాకారులు అర్హులన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో ప్రతిభ

కడప స్పోర్ట్స్: ఒంగోలు నగరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో వైఎస్‌ఆర్ జిల్లా బాలబాలికల జట్లు చక్కటి ప్రతిభ కనబరిచినట్లు జిల్లా టెన్నిస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వై. సుబ్బయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కడప బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో టోర్నమెంట్‌లో బౌలింగ్ విభాగంలో 12 వికెట్లు తీసిన ఒంటేరు వీక్షిత్‌రెడ్డి, అత్యధిక పరుగులు చేసిన కృష్ణలను జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు తెలిపారు. వీరు మే 22 నుంచి గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

వీఓఏ సస్పెన్షన్

చక్రాయపేట: మండలంలోని కల్లూరుపల్లె గ్రామ పంచాయతీ వీవో1 గ్రామ సమాఖ్యలో వీఓఏగా పనిచేస్తున్న పాతపాళెం రామభద్రప్పనాయుడును విధులనుంచి సస్పెండ్ చేస్తూ మండల సమాఖ్య ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 12న రామభద్రప్పనాయుడు పులివెందులలో షర్మిలమ్మతో కలసి ప్రచారంలో పాల్గొన్న విషయాన్ని ప్రత్యక్ష సాక్షులు ఫోటో తీసి ఎన్నికల అధికారులకు పంపి ఫిర్యాదు చేశారు.దీంతో ఎన్నికల అధికారి చక్రాయపేట ఎంపీడీవోను విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.రామభద్రప్ప ప్రచారంలో పాల్గొన్నట్లు రుజువు కావడంతో చర్యలకు సిఫారసు చేశారు.ఈమేరకు మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగవేణి సదరు వీవోఏను సస్పెండ్ చేసి సదరు ఉత్తర్వులను ఎన్నికల అధికారులకు పంపినట్లు ఆమె తెలిపారు.

చెక్‌పోస్టుల్లో పటిష్టమైన నిఘా

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



బి.కొత్తకోట: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావు

బి.కొత్తకోట: జిల్లాలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టుల వద్ద పకడ్బందీగా నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం బి.కొత్తకోట మండలంలోని ఆంధ్ర–కర్ణాటక బార్డర్ తానామిట్ట చెక్ పోస్టును ఎస్పీ కృష్ణారావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఇరువైపులా ఎన్ని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి, పట్టుబడిన అక్రమ కార్యకలాపాల సమాచారం అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు, వాటిలో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నట్లు చెప్పారు. చెక్‌పోస్టు సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. చెక్‌పోస్టు రహదారిపై వచ్చే వాహనాలపై 24 గంటలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. విధుల్లో ఉన్న సిబ్బందికి ఎటువంటి సమస్యలున్నా తక్షణమే తనకు తెలియజేయాలని కోరారు. తనిఖీల్లో నగదు పట్టుబడి సీజ్ చేస్తే, తిరిగి ఆ నగదును వారు పొందడానికి సంబంధిత ధ్రువపత్రాలతో ఎవరిని సంప్రదించాలో స్పష్టంగా తెలియజేసి, వారికి ఫోన్ నంబర్లను ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం గట్టులో ఓటర్లతో సమావేశమైన కలెక్టర్, ఎస్పీలు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పటిష్టంగా ఉండాలి

కురబలకోట: ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సూచించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఈవీఎంల భద్రతను ఆదివారం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈవీఎంలు, వీవీ ప్యాట్ బాక్సులకు వేసిన సీళ్లను తనిఖీ చేశారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

తంబళ్లపల్లె: మే 13వ తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, 100శాతం ఓటింగ్‌శాతం పెంచేలా కృషిచేయాలని, ఎన్నికల నోడల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు స్వేచ్ఛాయుత,శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భావితరాలకు ఆదర్శప్రాయుడు అంబేడ్కర్





అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావితరాలకు ఆదర్శప్రాయుడని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ లాంటి గొప్పవ్యక్తి భారతగడ్డపై ఉండడం గర్వకారణమన్నారు. ప్రాథమిక హక్కులు, అన్ని అంశాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం లేని విధంగా ఎంతో ముందు చూపుతో రాజ్యాంగాన్ని రూపొందించి మనకు అందించారన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ రంగస్వామి కారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఎస్పీ నివాళి: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విధుల్లో పునరంకితం అవుదామని జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. మహనీయుని ఆలోచనలు రాబోయే తరాలకు కూడా మార్గదర్శకమన్నారు. జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వివి రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐ వెంకటేశ్వర్లు, అడ్మిన్ ఆర్ఐ శ్రీనివాసులు, హోంగార్డ్స్ ఆర్ఐ చలపతి, ఎంటీఓ ఆర్ఐ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.


నేరం... దాచేస్తే నేరం!



నేరం.. దాచేయాలనుకుంటున్నారా.. 'ఆ.. చెప్పకపోతే ఏమవుతుందిలే' అని తేలిగ్గా కొట్టి పారేస్తున్నారా.. బీ అలర్ట్. అదంత సులువుకాదు.. దాయడానికి ప్రయత్నించడమూ సరి కాదు.. అవును.. దాయడానికి ప్రయత్నిస్తే మరో నేరమవుతుంది.. అది అసలుకే ఎసరు రావొచ్చు.. అనర్హత వేటుకు దారి తీయొచ్చు.. అవును..ఇదంతా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు ఈసీ చేస్తున్న హెచ్చరికలు.

- అభ్యర్థులు తమ కేసుల వివరాలు చెప్పాల్సిందే
- ఫారం26 అఫిడవిట్ అసంపూర్తిగా ఉంటే తిరస్కరణ
- ఎన్నికల ఖర్చుకు బ్యాంక్ ఖాతా తప్పనిసరి

సాక్షి, కడప డెస్క్: ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తప్పనిసరిగా తమపై ఉన్న కేసుల వివరాలు విధిగా తెలపాల్సిందే.. ఈ మేరకు 2015లో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు నిచ్చింది. ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులపై ఉన్న కేసులు, గత నేర చరిత్రను ఓటర్లు, ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నేరచరిత్ర కలిగిన అభ్యర్థులు విధిగా అందుకు సంబంధించిన వివరాలను వార్తా పత్రికలు, టీవీల ద్వారా మూడు సందర్భాల్లో ప్రకటించాలి. ఈ ప్రకటనలకు సంబంధించి నిర్దిష్ట గడువులనూ కేంద్ర ఎన్నికల సంఘం విధించింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం నాలుగు రోజుల్లో మొదటి దఫా, ఐదు నుంచి ఎనిమిదో రోజు మధ్య మరో విడత, తొమ్మిదో రోజు నుంచి ప్రచారం చివరిరోజు మధ్య మూడో దఫా ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది.



పార్టీలు సైతం..

అటు రాజకీయ పార్టీలు కూడా నేర చరిత్ర కలిగిన అభ్యర్థుల వివరాలను విధిగా ప్రకటించాల్సిందే. సదరు అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, వాటి వివరాలు, తదితరాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పార్టీలు తమ వెబ్ సైట్ లో పొందుపర్చాలి. కేసులు, నేరచరిత్ర ఉన్నప్పటికీ ఆ అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఆ కారణాలను కూడా రాజకీయ పార్టీలు తెలపాలి. అభ్యర్థులను ప్రకటించిన 48 గంటల్లోపు, నామినేషన్ల దాఖలు మొదటి రోజుకు రెండు వారాల ముందు ఆయా వివరాలతో కూడిన నివేదికను 72 గంటల్లోపు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలి.

అన్నింటా అఫిడవిట్ కీలకం..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నామినేషన్‌తో పాటు అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇదేఅత్యంత కీలకం. 1961 ఎన్నికల నిబంధనకు లోబడి 'రూల్4ఏ' కింద నిర్దేశించిన ఫారం26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థులకు సంబంధించిన అన్ని వివరాలతోపాటు ఆస్తులు, అప్పుల వివరాలు పొందుపర్చాలి. అభ్యర్థితోపాటు కుటుంబసభ్యులకు చెందిన వివరాలూ ఇవ్వాలి. మారిన నిబంధనల మేరకు గడచిన ఐదేళ్ల ఆస్తుల వివరాలు ప్రకటించాలి. ఏవైనా కేసులు ఉన్నా, గతంలో శిక్ష పడినా అందుకు సంబంధించిన వివరాలు పొందుపరచాలి. వాస్తవాలు దాచి అందులో తప్పుడు సమాచారం ఇస్తే అనర్హత వేటు ఎదుర్కోక తప్పదు. నామినేషన్ చివరి రోజు మధ్యహ్నాం 3 గంటల్లోపు సమర్పించే ఫారం 26లోని అన్ని వరుసలనూ తప్పనిసరిగా నింపాలి. లేదంటే అఫిడవిట్ తిరస్కరణకు గురవుతుంది.

బ్యాంక్ ఖాతా తప్పనిసరి



ఆర్పీ చట్టం 1951లోని సెక్షన్ 77 ప్రకారం ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాను తప్పనిసరిగా తెరవాలి. నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలనుకున్న తేదీకి కనీసం ఒక రోజు ముందు అభ్యర్థి పేరు మీద కానీ లేదా, అతని ఎన్నికల ఏజెంట్ ఉమ్మడి పేరుపై ఖాతాను తెరవవచ్చు. ఖాతా సంఖ్యను నామినేషన్ దాఖలు చేసే సమయంలో లిఖితపూర్వకంగా తెలపాలి. ఎన్నికల ఖర్చు పూర్తిగా ఈ ఖాతా నుంచే చేయాలి. ఫలితాలు ప్రకటన తరువాత, ఖాతా స్టేట్మెంట్ను దాఖలు చేసే సమయంలో ఖర్చుల ఖాతా స్టేట్మెంట్ తో పాటు బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వాలి. పారదర్శకత, జవాబుదారీతనం దృష్ట్యా అభ్యర్థులు నగదు రూపంలో విరాళాలు, రుణం స్వీకరించకూడదు. ఇందుకు సంబంధించి చెక్ లేదా డ్రాఫ్ట్ కానీ ఖాతా బదిలీ ద్వారా అందుకోవచ్చు. విరాళాలు, రుణాలు ఇచ్చే వ్యక్తుల పేరు, చిరునామా రోజువారీగా సమర్పించే లెక్కల్లో నమోదు చేయాలి.

సింహవాహనంపై ప్రతాప రాముడి విహారం



సింహవాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు

వాల్మీకిపురం: వాల్మీకిక్షేత్రంలో శతశతాబ్ద చరిత్ర కలిగిన శ్రీ పట్టాభిరాములవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఆదివారం రాత్రి స్వామివారు సింహవాహనం అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం 8గంటలకు స్వామివారిని కల్పవృక్ష వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించారు. ఉదయం 10గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజన సేవ జరింది. సాయంత్రం ఊంజల మండపంలో ఊంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి 8గంటలకు ఉత్సవర్లను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాలతో అలంకరించి సింహవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం తిరుమాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8గంటలకు సర్వభూపాల వాహనం, 10గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ఊంజల సేవ, రాత్రి 8గంటలకు పెద్దశేష వాహన సేవ.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రామసముద్రం మండలంలో జరిగింది. మదనపల్లి మండలం మాలేపాడుకు చెందిన రెడ్డప్ప నాయుడు (45) హరి(35) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో కర్ణాటకకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలోని కట్టుబావి వద్ద ఎదురుగా అకస్మాత్తుగా కారు రావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి ఇద్దరు కింద పడ్డారు. రెడ్డప్ప నాయుడుకు తీవ్ర గాయాలు కాగా హరి స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



చెయ్యేరు వంతెనపై బోల్తాపడిన ఆటో

రాజంపేట : కడప–చెన్నై జాతీయ రహదారిలోని చెయ్యేరు వంతెనపై ఆదివారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆటోలోని ఆరుగురిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమి కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.


దుప్పికి గాయాలు



గాయపడిన దుప్పి

సిద్దవటం : మండలంలోని కమ్మపాళెం వద్ద పొలాల్లోకి వచ్చిన దుప్పి కుక్కల దాడిలో గాయపడింది. స్థానికులు గుర్తించి వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దుప్పికి చికిత్స చేయించి అడవిలో వదలేశారు.

నేను ఈవీఎంను..
మీ భవిష్యత్తు నిర్ణేతను.!



- అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం
- సమయం... శ్రమ.. కాగితం ఆదా
- జిల్లాలో ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగం
- అంధుల కోసం ప్రత్యేక గుర్తులు

జిల్లాలో ఎన్నికలకు వినియోగించే మిషన్ల సమాచారం..


కేటగిరీ	పార్లమెంటు సెగ్మెంట్	అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తం
బ్యాలెట్‌యూనిట్	1931	1931	3862
కంట్రోల్ యూనిట్	1931	1931	3862
వీవీప్యాట్	2092	2092	4184

రాయచోటి/మదనపల్లె సిటీ : ''నేను మీ ఈవీఎం''ను మీకు తెలుసు కదా.. ఎన్నికల్లో మీరు ఎన్నుకునే నాయకుడిని ఓటు అనే ఆయుధం ద్వారా నా యంత్రంతో ఎన్నుకుంటారు.. గతంలో బ్యాలెట్ పేపరు పైన ముద్రించిన గుర్తులు, పేర్లపైన ఓటు వేసేవారు. నేడు అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాలతో మీ ముందుకు వచ్చాను.. ఐదు సంవత్సరాల మీ ప్రాంతం, మీ భవిష్యత్తుకోసం ఆలోచించి నిర్ణయం తీసుకుని మీకు నచ్చిన నాయకుని పేరు, గుర్తుపైన ఓటు అనే ఆయుధాన్ని నొక్కుతారు కదా.. 'అదే నేను మీ ఈవీఎంను' మీ కోసం ఇలా పని చేస్తానని ఒక్కమారు గుర్తు చేస్తున్నా..

ప్రపంచ వ్యాప్తంగా అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఎన్నికలలో ఈవీఎంలను వినియోగిస్తున్నాయి. మన దేశంలో ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈవీఎంలు ప్రత్యేకమైనవి. వీటి అంతర్గత భద్రత, రక్షణ, పకడ్బందీగా ఉంటాయి. నెట్‌వర్క్‌లతో నియంత్రించలేని పరిజ్ఞానంతో వీటిని రూపొందించారు. ఎన్నికల ప్రక్రియ అంతా పారదర్శకంగా ఓటర్లకు కళ్లముందు కనిపించేలా తీర్చిదిద్దారు. ఈవీఎంలలో మూడు భాగాలుంటాయి. ఒకటి కంట్రోల్ యూనిట్(సీయూ), రెండోది బ్యాలెట్ యూనిట్ (బీయూ), మూడోది వీవీ ప్యాట్‌లు ఉంటాయి.


అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, రాజంపేట పార్లమెంటు స్థానానికి మే 13వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1609 పోలింగ్ కేంద్రాల్లో ఇందుకోసం జిల్లా యంత్రాంగం ఈవీఎంలను పకడ్బందీగా ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) ద్వారా ఓటు వేసే విధానంపై అధికారులు క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున ఈవీఎంలను వినియోగించే విధానంపై ప్రిసైడింగ్ అధికారుల (పీఓ)కు సైతం శిక్షణ ఇచ్చారు.

పీఓ వద్ద కంట్రోల్ యూనిట్..



ఈవీఎంలో ప్రధానంగా రెండు యూనిట్లు ఉంటాయి. ఒకటి కంట్రోల్ యూనిట్, రెండోది బ్యాలెట్ యూనిట్, ఈ రెండింటిని ఐదు మీటర్ల కేబుల్ అనుసంధానం చేస్తుంది. పీఓ వద్ద కంట్రోల్ యూనిట్ ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌ను ఓటరు ఓటు వేయడానికి వీలుగా నిర్దేశించిన ప్రదేశంలో ఉంచుతారు. కంట్రోల్ యూనిట్‌లోని బ్యాలెట్ బటన్ ద్వారా పీఓ అనుమతించిన తర్వాత ఓటరు బ్యాలెట్ యూనిట్‌లో ఓటు వేయడానికి వీలవుతుంది. ఒక ఓటరు ఒక ఓటు మాత్రమే వేయగలరు. ఓటు వేసిన వెంటనే కంట్రోల్ యూనిట్‌లోని బ్యాలెట్ బటన్ లాక్ అవుతుంది. దీంతో మరోసారి ఓటు వేసేందుకు వీలుండదు.

42 ఏళ్ల చరిత్ర




స్వతంత్ర భారతావనిలో ఎన్నికలను తొలుత పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహించేవారు. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ఈవీఎంలను ప్రవేశపెట్టారు. దీంతో పోలింగ్ సమయం ఆదాతో పాటు ఓట్ల లెక్కింపు శరవేగంగా పూర్తవుతుంది. ఇవి అందుబాటులోకి వచ్చి 42 ఏళ్లు దాటింది. 1982లో తొలిసారిగా కేరళలోని పరూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించారు. 1982–83లో జరిగిన ఉప ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో ఈవీఎంల ద్వారా ఓటు హక్కును ప్రజలు వినియోగించుకున్నారు. 1984, ఆగస్టులో ఈవీఎంలను వినియోగించరాదంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 1988, డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 81–ఏ ను ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చింది. ఈ సవరణ అనంతరం పరిశీలన తర్వాత ఈవీఎంలతో ఓటింగ్ ప్రక్రియకు సుప్రీంకోర్టు అనుమతించింది. 1990లో సాంకేతిక నిపుణుల కమిటీ ఈవీఎంల వాడకానికి సిఫార్సు చేసింది. 1998లో ఈవీఎంల వాడకంపై ప్రజామోదం లభించింది. 1999–2004 మధ్యలో వివిధ రాష్ట్రాలకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈవీఎంలను పూర్తి స్థాయిలో వాడారు. 2013 నాగాలాండ్‌లోని నాక్సెన్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో వీవీప్యాట్‌లను (ఓటర్ వెరిఫేయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) మొదటిసారిగా వినియోగించారు. 2013లో సుప్రీంకోర్టు దశలవారీగా వీవీ ప్యాట్లను వినియోగంలోకి తేవాలని ఆదేశించింది.

ఓటును చూపే వీవీప్యాట్..!



ఎన్నికల్లో ఈవీఎంలపై మరింత నమ్మకాన్ని, పోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు ఎన్నికల సంఘం వీవీప్యాట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 2017 తర్వాత అన్ని ఎన్నికల్లో వీటిని వినియోగిస్తున్నారు. ఓటరు తాను ఓటు వేసిన వ్యక్తికే ఆ ఓటు పడిందో లేదో పరిశీలించుకోవడానికి అనుకూలంగా తయారు చేసిన యంత్రం వీవీప్యాట్. వీటి బటన్ నొక్కి ఓటు వేసిన తర్వాత పక్కనున్న వీవీప్యాట్‌లో ఒక చీటీ ముద్రించి కనిపిస్తుంది. ఈ చీటిలో ఓటరు వేసిన అభ్యర్థి క్రమసంఖ్య, పేరు, గుర్తు ఉంటాయి. ఈ చీటీ కేవలం ఏడు సెకన్లు మాత్రమే కనిపిస్తుంది. అనంతరం ఆ చీటి కట్ అయ్యి వీవీప్యాట్‌లోని పెట్టెలో పడిపోతుంది.

అంధుల కోసం..



బ్యాలెట్ యూనిట్‌లో అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపితో కూడిన గుర్తులు ఉంటాయి. ఓటు వేసే నీలి రంగు బటన్ పక్కన బ్రెయిలీ లిపితో సంఖ్య ఉంటుంది. చేతి వేళ్లతో తడిమితే స్పష్టంగా గుర్తు పట్టవచ్చు. తాము ఓటు వేయాలనుకున్న అభ్యర్థి వరుస సంఖ్య ఆధారంగా అంధులు సులభంగా ఓటు వేసుకునే వెసులుబాటు కల్పించారు.

ఎంపీ అవినాష్‌రెడ్డిని కలిసిన దండు వీరయ్య మాదిగ



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న దండు వీరయ్య మాదిగ

కడప కార్పొరేషన్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డిని కలిశారు. ఆదివారం ఉదయం కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన్ను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎంపీని దండు వీరయ్య మాదిగ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబుతో పాటు ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఖాజీపేట : అదుపు తప్పిన కారు బ్రిడ్జి ముందు భాగంలోని డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు నుంచి రవి, ఆంజనేయులు, శ్రీనివాసులు అనే ముగ్గురు మిత్రులు కడపకు బయలు దేరారు. చెన్నూరు బ్రిడ్జి వద్దకు రాగానే కారు అదుపుతప్పి బ్రిడ్జి ముందు భాగంలోని అర్చిని ఢీకొంది. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న రవి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని ఆంజనేయులు, శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న ఖాజీపేట పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అపురూప వారసత్వ సంపదకు నిలయం వైఎస్సార్ జిల్లా

ఇంటాక్ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన



వారసత్వ పర్యటనలో పాల్గొన్న ఇంటాక్ సభ్యులు

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా అపురూప వారసత్వ సంపదకు నిలయమని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కందుల చంద్రఓబుళరెడ్డి(నాని) పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా ఆదివారం భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు పుష్పగిరి వారసత్వ క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా బస్సు యాత్రను నానితో పాటు ప్రముఖ వైద్యులు ఓబుళరెడ్డి తదితరులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటాక్ ద్వారా జిల్లాలోని మరుగున పడిన వారసత్వ సంపదకు గుర్తింపు తెచ్చి వాటిని రక్షించుకుని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు జరుగుతున్న కృషి అభినందనీయమన్నారు. తమవంతుగా ఎప్పటికీ ఈ అంశంపై సహకారం ఉంటుందన్నారు. ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపద పరిరక్షణకు ఇంటాక్ అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. పుష్పగిరి యాత్ర దర్శినిలో భాగంగా తొలుత గుట్టపైగల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ సముదాయాలను దర్శించుకున్నారు. అనంతరం సమీపంలోని ఇంద్రనాథేశ్వరస్వామి ఆలయాన్ని, తర్వాత పుష్పగిరి గ్రామంలోని శ్రీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయం, త్రికుటేశ్వరస్వామి ఆలయం, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లి అక్కడి శిల్పసంపద, మూలమూర్తులు, శాసనాలను సందర్శించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, ఇంటాక్ కో కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు, వైవీయూ పాలక మండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, డాక్టర్ కోట మృత్యుంజయరావు, డాక్టర్ తవ్వా వెంకటయ్య, సంజీవరెడ్డి, జోజిరెడ్డి, భారవి, వర్మ, నాగవేణి, అరుణ పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన వంశీకృష్ణ



గాయపడిన వెంకటేశు

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో ఆలంఖాన్‌పల్లె రాణితోటలో నివసిస్తున్న కొండూరు వంశీకృష్ణ (29) అనే యువకుడిపై సురేంద్ర అలియాస్ జాకీ, రాజా, ఉపేంద్ర, వెంకటేష్, మరికొందరు కలిసి బీరు బాటిళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో వంశీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతనితోపాటు సోదరుడు వెంకటేశు, తల్లి వెంకటలక్ష్మి, తండ్రి సుబ్బరాయుడులకు కూడా గాయాలయ్యాయి. పాత కక్షల నేపథ్యంలో ఈ సంఘటన జరిగిందని పోలీసుల విచారణలో తేలింది. ఈ సంఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇప్పటికే సురేంద్ర అలియాస్ జాకీని అరెస్టు చేశారు.

అగ్నిమాపక శాఖ సేవలు అభినందనీయం



అగ్నిప్రమాదాల అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : ప్రమాదాల సమయంలో అగ్నిమాపక శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా కడప ఫైర్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా అగ్నిమాపక అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించే కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలే కాకుండా రోడ్డు ప్రమాదాలు, వరదలు వచ్చినప్పుడు రక్షణ, సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి ఐ. ధర్మారావు, కడప అగ్నిమాపక కేంద్ర, సహాయ జిల్లా అధికారి పి. బసివిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావీయకండి

కడప కల్చరల్ : ప్రజాస్వామ్యంలో హింసకు తావివ్వరాదని న్యూ నేటివ్ కృపా చర్చి పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ అన్నారు. ఆదివారం స్థానిక బిల్టప్ వద్దగల ఈ చర్చిలో ఆయన విశ్వాసులతో కలిసి నిన్నటి దాడిలో గాయపడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేమం, ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ఎవరూ కాదనలేరు గనుక మంచి ఆదరణ లభిస్తోందన్నారు. హింసకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రవితేజ, రవి, సుధాకర్, అగస్టీన్, శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీ వలసలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వెలిగల్లు టీడీపీ నాయకులు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఆకేపాటి, పోలా, గంటా

గాలివీడు : మండలంలోని వెలిగల్లు, గోపనపల్లె గ్రామాలలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పార్టీలో చేరిన వారిలో వెలిగల్లు మాజీ సర్పంచ్ వేమయ్య, సుబ్బయ్య, శంకర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, గండిమడుగు ఆలయ చైర్మన్ గంగులప్ప, లోకేశ్వర్, బాబా, రెడ్డప్ప తదితరులు ఉన్నారు. గోపనపల్లె గ్రామంలో నారాయణరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఇరగంరెడ్డి, రాజారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీకి భారీ షాక్

రాజంపేట టౌన్ : తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్న వారి సంఖ్య రోజు, రోజుకు పెరిగిపోతూనే ఉంది. తాజాగా మన్నూరు ప్రాంతానికి చెందిన దాదాపు రెండు వందల కుటుంబాలు వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జాహిద్‌అలీ, పట్టణ అధ్యక్షుడు మసూద్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. గత మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 26వ వార్డులో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన షేక్ మహమ్మద్ ఇషాక్‌తో పాటు మిగిలిన కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరడం విశేషం. పార్టీలో చేరిన వారందరికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్ రెడ్డి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా నరహరి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆకేపాటి, పోలా, గంటా మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు గతంలో ఎన్నడు లేని విధంగా భారీ మెజార్టీ వస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన షేక్ మహమ్మద్ ఇషాక్ మాట్లాడుతూ ముస్లీం మైనార్టీలంతా వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహమ్మద్ అలీ, తుపాకుల రసూల్, షేక్ యాసిన్, జావీద్, మౌలా, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డీలర్ సుబ్బరామిరెడ్డి, లాయర్ సుబ్బరామిరెడ్డి, మర్రి రవి, జెనుగు కృష్ణారావుయాదవ్, వడ్డే రమణ, మిర్యాల సురేఖ, శేఖర్‌రెడ్డి, పోలి మురళీరెడ్డి, న్యామతుల్లా, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్య గొంతుకోసి హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన గులాబ్ జాన్

మదనపల్లె : పూటుగా మద్యం తాగిన భర్త కట్టుకున్న భార్యపై దాడి చేసి, మద్యం బాటిల్ పగలగొట్టి గొంతు కోసిన సంఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. బి కొత్తకోట మండలం మల్లెల గ్రామానికి చెందిన ఎస్.గులాబ్ జాన్ (36), ఎస్.ఫయాజ్ దంపతులు. వీరికి ఇంతియాజ్ (21) అన్సు (18) సంతానం ఉన్నారు. ఫయాజ్ టైలర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మద్యానికి బానిసై, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి విచక్షణా రహితంగా కొట్టేవాడు. కుమారుడు ఇంతియాజ్ డ్రైవర్‌గా పని చేస్తుండడంతో అతని అరకొర సంపాదనతో పాటు పుట్టింటి వారి సాయంతో గులాబ్ జాన్ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ క్రమంలో ఆమె ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో, మదనపల్లి మండలం కొత్తఇండ్లు పంచాయతీ తాళ్ల సుబ్బన్న కాలనీలో నివాసం ఉంటున్న తల్లి రబియా వద్దకు వచ్చింది. నెల రోజులుగా ఇక్కడే ఉంటూ చికిత్స తీసుకుంటోంది. భార్య తన ఇంటికి రాకపోవడంతో ఫయాజ్ తరచు మదనపల్లికి వచ్చి గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పూటుగా మద్యం తాగి తాళ్ల సుబ్బన్న కాలనీలోని భార్య ఉంటున్న ఇంటికి వచ్చాడు. వెంట మరో మద్యం బాటిల్ తెచ్చుకున్నాడు. నేరుగా ఇంట్లోకి వెళ్లి వెంట తెచ్చుకున్న మద్యం తాగి, బాటిల్ పగలగొట్టి ఒక్కసారిగా భార్య గులాబ్ జాన్ పై దాడి చేసి పగలగొట్టిన మద్యం సీసాతో ఆమె గొంతు కోశాడు. ఆమె తల్లి రబియా అడ్డుకునేందుకు ప్రయత్నించగా, ఆమెను బెదిరించాడు. దీంతో రబియా కేకలు వేయడంతో, మనవరాలు అన్సు పరిగెత్తుకుంటూ వచ్చి కట్టెతో తండ్రి ఫయాజ్‌ను కొట్టడంతో, భార్యను వదిలేసి రక్తపు మరకలతో అక్కడి నుంచి పారిపోయాడు. దాడిలో గులాబ్ జాన్ గొంతు తెగడంతోపాటు చేతికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాధితురాలిని హుటాహుటిన 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్స అందించడంతో ఆమె కోలుకుంటోంది. తన మనవరాలు అన్సు అడ్డుకోవడంతో కూతురికి ప్రాణాపాయం తప్పిందని, లేకుంటే అల్లుడి చేతిలో దారుణంగా హతమై ఉండేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై తల్లి రబియా తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

'ఎలక్షన్ మిత్ర' వెబ్‌సైట్‌ను సద్వినియోగం చేసుకోండి

వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : 'ఎలక్షన్ మిత్ర' వెబ్‌సైట్‌ను ఎన్నికల సమయంలో ప్రజలకు ఉపయోగపడేలా రూపొందించారని వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. భవిష్యత్తులో పోలీసు అధికారులకు కేసుల పరిష్కారంలో కూడా ఉపయోగపడుతుందన్నారు. ఆదివారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో 'ఎలక్షన్ మిత్ర' వెబ్‌సైట్‌ను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర డీజీపీ కె.వి రాజేంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలో, రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా వారి మార్గదర్శకత్వంలో వైఎస్ఆర్ జిల్లా పోలీసు ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం చొరవతో 'ఎలక్షన్ మిత్ర'(డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎలక్షన్ మిత్ర. ఇన్) అనే వెబ్‌సైట్‌ను రూపొందించామన్నారు. ఈ వెబ్‌సైట్‌ను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారితంగా రూపకల్పన చేశారన్నారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ చర్యలు ఇలా..

■ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం లైసెన్స్‌డ్ ఆయుధాలు 725 ఉన్నాయి. భద్రతకు ఉపయోగిస్తున్న వాటితో కలిపితే మొత్తం 774 ఉన్నాయి. వీటిలో 678 ఆయుధాలు డిపాజిట్ చేశారు. ఇంకా 96 ఆయుధాలు భద్రత కల్పించాల్సిన బ్యాంకులు, ఇతర సంస్థల వద్ద ఉన్నాయి.

■ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గతంలో నేరాలకు పాల్పడిన, పాల్పడే అవకాశం ఉన్న వారిని బైండోవర్ చేశారు. బైండోవర్ కేసులలో 107 సీఆర్‌పీసీ కింద 2607 కేసులు నమోదు కాగా, 15215 మందిని బైండోవర్ చేశారు. 109 సీఆర్‌పీసీ కింద 33 కేసులను నమోదు చేయగా, 33 మందిని బైండోవర్ చేశారు. 110 సీఆర్‌పీసీ కింద 967 కేసులు నమోదు చేయగా, 2567 మందిని బైండోవర్ చేశారు.

■ జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసుశాఖ సంయుక్తంగా నాటుసారా, బెల్లం ఊట ధ్వంసం, అక్రమ మద్యంపై దాడులు, అరెస్టుల వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో 43 నాటుసారాకు సంబంధించిన కేసులను నమోదు చేశారు. వీటిల్లో 83 మందిని అరెస్టు చేసి, 1433 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు.